కథా నిలయం
6094
శ్రీకాకుళం

# అస్థిత్వం

' ఊర్మిళా దేవి నిద్ర ' పాటని మా అమ్మమ్మ చాలా చక్కగా శ్రావ్యంగా పాడేది. పేరంటాని కెళ్ళినప్పుడు అమ్మలక్కలు అడగటం ఆలస్యం వెంటనే పాడేసేది. మా అమ్మ కూడా పాడేది గాని తనకాపాట పూర్తిగా రాదు. నాలుగైదు చరణాలు పాడేదంతే. నాకసలు పాడటమే రాదు. కానాపాటని చిన్నప్పుడు ఎంతో ఇష్టంగా శ్రద్ధగా వినేదాన్ని.

* * *

శార్వరితో నా పెళ్ళి చాలా చిత్రంగా జరిగింది.

మాది పల్లెటూరు అయినా సమీప పట్నంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూండే దాన్ని.

ఒక పెళ్ళిలో శార్వరి నన్ను చూశార్ట. పట్టు లంగా కట్టుకుని ఓణీ ధరించి కాళ్ళకు వెండి మువ్వల పట్టాలతో చెవులకి జూకాలతో ఎంతో చలాకీగా తిరుగుతూ కన్పించానుట.

మా గురించి వాకబు చేయగా బీరకాయ పీచు బంధుత్వం ఉందని తెలిసిందిట. వెంటనే ఒక బంధువు ద్వారా కబురంపారు.

" యుక్తా ! నువ్వెంతో అదృష్టవంతురాలివే. నిన్ను వెదుక్కొంటూ గొప్ప సంబంధం వచ్చిందే " సంబరంగా చెప్పేరు నాన్న.

పెళ్ళైతే చదువుకి మంగళం పాడించేస్తారన్పించి ఏడ్చేశాను. " డిగ్రీ చేతికొచ్చేదాకా పెళ్ళి చెసుకోను " అంటూ గునిశాను.

" అల్లుడొచ్చే దాకా అమావాస్య ఆగుతుందా చెప్పు. ముద్దొచ్చినప్పుడే చంకెక్కాలన్నారు పెద్దలు. పైగా కోరి వచ్చిన సంబంధం ..."

" అబ్బాయి ఏం చేస్తాడేవిటీ " ఆరా తీసింది అమ్మ.

" ఇంజినీరే. నెల తిరిగే సరికి పదివేలొచ్చి చేతిలో పడతాయి. కట్నపాశ మరీ ఎక్కువగా లేదు....."

" నా కోసం మీరేమీ అప్పుల పాలవ్వొద్దు....."

" ఇవతల మాట్లాడుకొంటోంటే మధ్యన నీ సన్నాయి నొక్కుళ్ళేవిటే. దాని గోలకేం గాని మీరు చెప్పండి. మీకీ సంబంధం నచ్చిందా ? "

" అన్ని విధాలా బావుంది. ఒక్కడే కొడుకు. అమ్మాయి సుఖపడుతుంది "

" మరింక చూడటం ఎందుకూ. పెద్ద మనుషుల్ని తీసుకెళ్ళి కట్నకానుకలు మాట్లాడి ముహూర్తం పెట్టుకురండి. అబ్బాయి అమ్మాయిని చూసేశాడు గనుక ఇహ పెళ్ళి చూపుల అవసరమే లేదు..."

' నేను చూళ్ళేదుగా ' అనాలకున్నాను. నోరు పెగల్లేదు.

" చదువయ్యే దాకా పెళ్ళివూసెత్తొద్దు నాన్నా " అర్థించాను.

నాన్న నవ్వేరు. " నువ్వు బాగుండాలి. నీ కాపురం బాగుండాలి " నా తల నిమురుతూ అన్నారు.

మరి వారం తిరక్కుండానే పెళ్ళి పనులు మొదలయ్యాయి.

" కాబోయే మీ ఆయనెలా వుంటాడే ? నీకు నచ్చాడా ? " అని స్నేహితులు గుచ్చి గుచ్చి అడిగారు. అతడి ఫోటో కూడా చూడలేదని చెప్పలేక పొడిగా నవ్వి ఊరుకున్నాను.

పెళ్ళిలో కూడా శార్వరిని సరిగ్గా చూళ్ళేక పోయాను. ఎప్పుడైనా కాస్తంత తల పైకెత్తితే చాలు తోడి పెళ్ళి కూతురైనా మా పిన్ని నా తలని వంచేసేది.

అక్కడికీ మెడలు నొప్పెడుతున్నాయని గొణిగాను. " ఆడపిల్ల అన్నాక అన్నీ ఓర్చుకోవడం నేర్చుకోవాలి " అంది.

పాలగ్లాసుతో గదిలో అడుగుపెట్టిన అయిదు నిమిషాలకి సిగ్గు తెరల్ని

తొలగించుకుని ఆయన్ని చూశాను. ఎంతో బాగా అన్పించారు. నాకు తెలీకుండానే నిట్టూర్చాను.

" కమాన్ యుక్తా...కూర్చో...."

నా చేయి పట్టుకుని మంచం మీద తన కెదురుగా కూర్చోబెట్టారు. నా తనువు తీగలు సవరించిన వీణ అయ్యింది.

మధుర సంభాషణ వినడానికి చెవులు రిక్కించాను.

ఆయన చాలా మాట్లాడారు. అంతా తన గురించే. తన చదువు గురించే. ఉద్యోగం గురించే. ప్రమోషన్ల గురించే. ధన సంపాదన గురించే. తన స్వప్నాల గురించే. అయిదేళ్ళ వరకూ పిల్లల ఊసెత్త వద్దనీ చెప్పారు.

అదంతా మౌనశ్రోతగా విన్నాక నన్ను అక్కున చేర్చుకున్నారు. కడలి కెరటమై ముంచెత్తారు. పది నిమిషాల తర్వాత గుర్రు పెట్టి నిద్ర పోయారు !

" ప్రాజెక్టు వర్కు వదిలేసి ఈ మాయదారి పల్లెటూరికి పదే పదే తిరగటం నాకు కుదర్దు. నెలలోనే యుక్తని కాపురానికి పంపించెయ్యండి. " అన్నారు వెళ్తూ.

" మీరెలాగంటే అలాగే " అన్నారు నాన్న తలాడిస్తూ.

వెళ్ళే ముందు నా వంక చూస్తారనీ చిరునవ్వు వరమిస్తారనీ ఆశించిన నాకు నిరాశే ఎదురయ్యింది.

మరి పది రోజులకి అత్తవారింట అడుగుపెట్టాను.

మావగారు రిటైర్డు తాశీల్దారు. స్వంతిల్లు. పల్లెలో కొంత పొలం కూడా వుందిట.

అత్త మామలు నన్ను బాగానే చూసేవారు. ఏం చేయాలో ఎలా చేయాలో చెప్పేవారు. వారు చెప్పినట్టు చేస్తే ఎంతో మెచ్చుకునే వారు.

" ఎలాంటి అమ్మాయిని కోరుకున్నామో అక్షరాలా అలాంటి అమ్మాయే లభించింది " అని మురిసి పోయేవారు.

శార్వరికి కంప్యూటరే సర్వస్వమూనూ. కొత్త ప్రోగ్రాం నేర్చుకుంటున్నాననీ కొత్త

ప్రోజెక్టు స్టార్ట్ చేశామనీ అంటూ దానితోనే ఊరేగేవారు. మరీ బలవంత పెడితే అయిష్టంగానే సినిమాకో షికారుకో తీసుకెళ్ళేవారు.

" కళ్ళు తిరిగేంత సంపాదించాలి " రోజు కొక్కసారైనా ఆయన వల్లించే తారక మంత్రం అది !

" మనకి బాగానే వుంది కదా " అంటే, " నీకేం తెలీదు పిచ్చీ " అనేవారు.

" రిటైరయ్యే ముందు తాశీల్దారునయ్యాను గాని ఒక్క ఏడాది ముందయ్యి వుంటే కుమ్మేసేవాడ్ని " వారాని కొక్కసారైనా మా మావగారు జనాంతికంగా చెప్పే డైలాగ్.

" అబ్బాయి నిన్ను సుఖ పెట్టాలనే రాత్రీ పగలూ కష్టపడుతున్నాడు. వాడిని కంటికి రెప్పలా చూసుకో. వాడికి ఇష్టంలేనిదేదీ చెయ్యకు " అనేది అత్తగారు వీలుదొరికినప్పుడల్లా.

ఒక రోజున శార్వరి ఆనందపు తేరు మీద వచ్చారు.

" ఐ గాటిట్ " అంటూ సంబరంతో అరిచారు.

" మస్కట్ ఆఫర్ కన్ఫర్మ్ అయ్యిందా ? " మావగారడిగారు.

అయోమయంగా చూశాను.

" యస్ డాడ్. నా టెరమ్స్‌కి ఒప్పుకున్నారు. నాలుగేళ్ళ కాంట్రాక్ట్. అగ్రిమెంట్ పేపర్లు మెయిల్ చేశారు "

అత్తమామలు అభినందనలతో ముంచెత్తారు. నేనూ శృతి కలిపాను.

" పాపం అత్తమ్మ మావయ్యా ఒంటరిగా ఉండలేరు. వారినీ మనతో బాటు తీసుకెళ్దామండీ " పడకెక్కుతూ అన్నాను.

వింతగా చూశారు. " నిన్ను తీసుకెళ్తున్నానని ఎవరు చెప్పేరు ? "

" నన్ను వదిలేసి ఎలా వెళ్తారు ? "

" సారీ యుక్తా. గల్ఫ్ కంట్రీస్ గురించి నీకు తెలీదు. లేడీస్‌కి సేఫ్టీ తక్కువ. నేనొక్కడ్నే వెళ్తాను. ఐ వాంట్ టు ఎచీవ్ సమ్‌థింగ్. ఒక్కడ్నే అయితే బోల్టు టైముంటుంది.

పైగా ఎక్కువ సేవ్ చెయ్యొచ్చు. జస్ట్ ఫోర్ ఇయర్స్. దట్సాల్. ఆ తర్వాత ఇక్కడికొచ్చి స్వంతంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ ఫ్లోట్ చేస్తాను..."

నా ఒంట్లోని శక్తంతా ఒక్కసారిగా హరింపబడినట్టు అయిపోయాను.

" మీ తోడు లేకుండా .. నాలుగేళ్ళు ....! "

" సిల్లీగా మాట్లాడకు..."

" మీరు వెళ్ళకపోతేనేం ? ఇక్కడంతా బాగానే వుందిగా. ఇక్కడే వుండి ఇంకా మంచి జాబ్‌కి ప్రయత్నించొచ్చుగా ... "

" అది జీతమా ? ఇది జీవితమా ? ట్రాష్ ! నీకు లెక్కలేనన్ని సార్లు చెప్పేను. ఐ వాంట్ టు బికమ్ రిచ్ క్విక్లీ. అందుకే ఈ తపన. ఈ తపస్సు. జస్ట్ ఫోర్ ఇయర్స్‌లో ఒన్ క్రోర్ సంపాదించు కొస్తాను. మన లైఫ్ మన లెవెల్ మన స్టేటస్ నువ్వు కలలో కూడా ఊహించలేనంతంగా మారిపోతాయి.."

ఆయన కళ్ళల్లోని మెరుపులు చూస్తూ నా కన్నీళ్ళని కళ్ళల్లోనే అదిమేసుకున్నాను.

ఆయనెక్కిన విమానం ఆకాశంలోకి ఎగిరిపోయింది !

గడియారంలోని ముల్లులా టిక్కు టిక్కు మంటూ గడుస్తోంది కాలం.

ఏమీ తోచదు. ఏం చేయాలో తెలీదు. ఏదైనా చెయ్యాలన్న ఆసక్తీ లేదు.

నేను, ఇల్లు, ఇంటి పని, అత్తమామలూ, వారి సేవ – ఇవే లోకమై పోయింది.

నా రెక్కలు కత్తిరింపబడినట్టూ నా ప్రపంచాన్ని కుదించేసినట్టూ ఉంది.

" నాకింట్లో ఏమి తోచడం లేదత్తమ్మా. కాలేజీలో చేరి డిగ్రీ పూర్తి చేస్తాను. గ్రాడ్యుయేట్ అవ్వాలన్న నా కల నెరవేర్చుకుంటాను "

నా మాటలు వింటూనే బుగ్గలునొక్కుకుంది అత్తయ్య. " పెళ్ళైన దానివి తగుదునమ్మా అని తిప్పుకుంటూ కాలేజీకెళ్తావా ? "

" తప్పే ముందత్తమ్మా. పెళ్ళైన వాళ్ళు ఉద్యోగాలు చెయ్యడం లేదూ ? ! "

చిత్రంగా చూసి అంది. " అబ్బాయికలాంటి పన్లు ఇష్టం ఉండవు. ఎంచక్కా

చీర కట్టుకుని పూలు పెట్టుకుని ఇంట్లో మహాలక్ష్మిలా తిరగటమే అబ్బాయికిష్టం. అందుకేగా ఏరి కోరి నిన్ను చేసుకుందీ !"

" ఆయనిక్కడ వుంటే అలాగే వుండే దాన్ని. లేరు కదా. నాలుగేళ్ళదాకా రావటం కుదరదని చేప్పేరు కదా అత్తమ్మా "

" ఏమోనమ్మా. అదేదో మీ ఆయన్నే అడుగు " మూతి మూడు వంకర్లు తిప్పుకుంటూ అంది.

భారతనారి ఎలా వుండాలి ? ఎలా మసలాలి ? కట్టుబాట్లని సాంప్రదాయాల్ని ఎలా గౌరవించాలి ? – అంటూ భోజనాల దగ్గర క్లాసు పీకారు మావగారు.

కేవలం కాలేజీకి వెళ్తానన్నందుకేనా ఇన్ని పాఠాలు ?!

విస్తు బోయి చూశాను. అయినా వెనుకంజ వేయదలచలేదు.

శార్వరి ఫోన్ చేసినప్పుడు నా ఉద్దేశం చెప్పాను.

"ఇప్పుడు నువ్వు చదివి ఎవర్ని ఉద్ధరించాలి చెప్పు? హ్యాపీగా టీవీ చూస్తూ గడిపేసెయ్యక ! జస్ట్ ఫోర్ ఇయర్స్‌లో వచ్చేస్తాగా అప్పుడే మూడు నెలలు తగ్గిపోయాయి!"

" ఇంజినీరింగ్ చదివినా మీరు బోల్డన్ని కంప్యూటర్ కోర్సులు చెయ్యట్లేదూ ? "

" నేను వేరు నువ్వు వేరు. పోనీ డిస్టెన్స్‌లో చెయ్యి "

" వూహూ. నేను కాలేజీలో చేర్తాను "

లైన్ కట్ చేశారు. మరో పదిరోజుల్దాకా ఫోనుల్లేవు. ఆ తర్వాత ఫోన్ చేసినా నాతో మాటల్లేవు.

ఇవాళగాక పోయినా రేపైనా నా విజ్ఞానతృష్ణని మెచ్చుకుంటారని భావించి కాలేజీల గురించి ఎంక్వైరీ చెయ్యసాగాను.

మొండి ఘటాన్ని అనుకున్నారో మరేమనుకున్నారో గాని మొత్తానికి ' సరే ' అన్నారు. ఎన్నో జాగ్రత్తలు చెప్పారు. ఆంక్షలూ విధించారు.

విజయం సాధించినట్టు పొంగి పోయాను.

కాలేజీ జీవితం, సిటీ వాతావరణం, కొత్త స్నేహాలు, విస్తృతమైన ఆలోచనా పరిధి – నాలో చాలా మార్పు తీసుకొచ్చాయి.

నా డ్రెస్ మీద, ప్రవర్తన మీద, మాటల మీద, ఫోన్ల మీద, స్నేహితుల మీద – నిఘా పెరిగింది. ఏదో వంకన మావగారు కాలేజీ కొస్తూండటమూ గమనించాను.

నా రక్తం మరుగుతున్నా ' కూల్ ' గానే వున్నాను.

డిగ్రీ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. నేనెంతో శక్తివంతురాలైనట్టుగా అన్పించింది. పొంగిపోతూ ఆయనకి చెప్పేను. ముక్తసరి అభినందనలే లభించాయి.

తన కొడుకు డిస్టింక్షన్‌లో పాసయ్యాడని పదే పదే చెప్పే అత్తయ్య సైతం చప్పగానే స్పందించింది.

నాలో పట్టుదల పెరిగింది. ఎం.ఏ. సోషియాలజీ చేస్తానని శార్వరికి చేప్పేను.

" చదివింది చాల్లే. అమ్మానాన్నల్ని చూసుకో చాలు. వాళ్ళని సంతోషంగా ఉంచటమే నీ ఏకైక కర్తవ్యం "

" ఆ విషయంలో ఎలాంటి లోటూ రానివ్వను. మా ఊళ్ళోని ఏ అమ్మాయీ ఇంతవరకూ పీజీ చెయ్యలేదు. మీర్రావడానికింకా రెండేళ్ళు పడుతుందిగా. ఈలోగా చదివేస్తాను. కాదనకండి ప్లీజ్...."

" లక్ష్మణరేఖని దాటుతున్నావన్పిస్తోంది. అమ్మతో మాట్లాడేక చెబుతాన్లే ..."

మరి తల్లిదండ్రులతో ఏం మాట్లాడారో తెలీదుగాని ఇద్దరూ నా మీద కళ్ళు మూసుకుని పద్దారు. భరించలేకపోయాను.

" చదవటం నేరమా ? " సూటిగా ప్రశ్నించాను.

" చదువు నేరం కాదు. ఆ వంకన చెడు తిరుగుళ్ళు తిరగటం నేరం. మొగుడికి దూరంగా వున్న ఆడదాని ఒళ్ళూ మనస్సూ అదుపులో వుండవు..."

మావగారి మాటలకు మాడ్చేశాలా చూశాను. అసహ్యంగా చూశాను. పురుగులా చూశాను.

" నేను దూరంగా వుండలేదు. మీ అబ్బాయే వుంచారు..." వాడిగానే జవాబిచ్చాను.

" వాడికేం మగ మహారాజు. ఎలాగైనా ఉంటాడు. ఏమైనా చేస్తాడు. నీకు బుద్ధి ఉండక్కర్లేదూ ? " కయ్ మంది అత్తయ్య. " పిల్లా పీచూ వుండుంటే ఈ మాయదారి చదువులగోల వుండేది కాదు ! " గొణుక్కుంది.

పరిస్థితి చేజారుతోందన్పించింది. కోపాన్ని నిగ్రహించుకుంటూ మౌనంగా వుండిపోయాను. నన్నో బానిసలా ఎందుకు చూస్తున్నారో అర్థంగాక తర్కించుకున్నాను. మథన పడ్డాను.

కాని తలొంచటం ఇష్టంలేక మొండి ధైర్యంతోనే ఎం.ఏ.కి అప్లై చేశాను.

" నువ్వెందుకిలా మారిపోయావో అర్థంకావట్లేదు యుక్తా. అమ్మా నాన్నల్ని ముసలితనంలో నొప్పిస్తావెందుకు చెప్పు ? ఇంకొక్క రెండేళ్ళు బుద్ధిగా వుండలేవా ?"

నవ్వొచ్చింది. " ఇప్పుడు బుద్ధిగానే వున్నాను. ఇక ముందూ వుంటాను. నాకు నా మీద కొండంత విశ్వాసముంది. మీ మీద నాకు అపారమైన నమ్మకం వుంది. నా మీద మీకు వుందా?"

" అహహ - నమ్మకం వుందా లేదా అన్నది కాదు ప్రశ్న ..."

" ప్రశ్న అదే. సూటిగా చెప్పండి. వుందంటేనే ఎం.ఏ. చేస్తాను.."

కాస్త తటపటాయింపు తర్వాత " చేరైతే. స్నేహాలూ తిరుగుళ్ళూ కంట్రోల్లో వుంచుకో. తలవంపులు తెచ్చే పన్లేమీ చెయ్యకు...." అన్నారు.

ఫోన్లోనే గాఢమైన ముద్దు ఇచ్చాను.

నాలో ఆత్మస్థైర్యం పెరిగింది. విజేతలా యూనివర్శిటీ కెళ్ళి వస్తున్నాను.

అత్తమామలు సూటి పోటి మాటలు విసుర్తున్నారు. ఇది వరకట్లా అభిమానంగా చూట్టం లేదు. ప్రతి అడుగూ బూతద్దంతో పరిశీలిస్తున్నారు. బంధువుల దగ్గర రకరకాలుగా చెప్పి వాపోతున్నారు.

నేను నిదానంగా నడుస్తున్నప్పుడు నా నీడ వంకరగా ఉంటే, ఉందంటే

నేనెందుకు లక్ష్యపెట్టాలి ? అందుకే పట్టించుకోలేదు.

ఫైనల్ ఇయర్లో వుండగా గ్రూప్ ఒన్‌కి నోటిఫికేషన్ వచ్చింది.

క్యాంటీన్లో దూరి స్నేహితులమంతా దాని గురించే చర్చించాం.

సివిల్స్ మీద దృష్టి వున్న వాళ్ళు, "అందరం అప్లై చేద్దాం. కలెక్టివ్‌గా ప్రిపేరవుదాం" అని ప్రపోజ్ చేశారు.

" పాయింటే. ఒక రాయి విసిర్తే తప్పేంటి ? " అన్నారింకొకరు.

" ఊరికే రాయి విసరటమైతే టైం వేస్ట్. సీరియస్‌గా ప్రిపేరవుదాం. సాధిద్దాం. అధికారం చేజిక్కించుకుందాం " కించిత్తు ఆవేశంగానే అన్నాను.

తప్పట్లు కొట్టారంతా. మరి వెనుదిరగ లేకపోయాను.

ఇంట్లో చెప్పాలన్పించలేదు. చెబితే ఉత్సాహం మీద నీళ్ళు చల్లుతారని తెలుసు. కాని స్టడీ హవర్స్ పెరగటంతో నుదురు చిట్లిస్తూ చూశారు. పెదవి విప్పి మాత్రం అడగలేదు.

గ్రూప్ ఒన్ పరీక్ష చాలా బాగా రాశాను. రిజల్ట్స్ వచ్చాయి. ఇంటర్వ్యూకి సెలక్టయ్యాను. ఆనందం పట్టలేక అందరికీ చెప్పేసు. అమ్మనాన్నలకీ ఫోన్ చేశాను.

మావగారి మొహం తెల్లగా పాలిపోయింది. "గ్రూప్ ఒన్ అంటే ఆర్డీవో ర్యాంక్ పోస్టు..." రిటైర్డ్ తాశీల్దారునని గొప్పగా చెప్పుకునే ఆయన నోట ఆపైన మాటలు రాలేదు!

అపనమ్మకంగా చూసింది అత్తయ్య.

తెల్లారే సరికి అమ్మా నాన్నా వచ్చేశారు. అభినందించడానికనుకున్నాను.

వస్తూనే, " నువ్వు బుద్ధిగా కాపురం చేసుకుంటే చాలు ఊళ్ళేలక్కర్లేదు " అంది అమ్మ.

" అదేంటమ్మా . నేను గొప్ప ఆఫీసర్నైతే మనందరికీ గొప్ప కదూ ? నీ కూతురు ఎందరికో సాయ పడ్తోంటే జనంకోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తోంటే నీకు గర్వంగా ఉండదూ ?"

" మాకు గొప్పే. కాని అల్లుడుగారికిష్టం లేనప్పుడు..." అర్ధోక్తితో ఆగారు నాన్న.

" లక్ష్య సాధన ఆయనకెంతో ఇష్టం నాన్నా. కోట్లు సంపాదిచాలన్నది ఆయన లక్ష్యం. నేనేమిటో నా శక్తేమిటో ఋజువు చేసుకోవటం నా లక్ష్యం. ఇందులో తప్పుబట్టాల్సిందేమీ లేదు..."

" తప్పొప్పులు నీ దృష్టితో కాదమ్మా నీ భర్త దృష్టితో చూడాలి. అతడు చెప్పిందే ఒప్పు. అదే నీకు వేదం !" రకరకాలుగా కన్విన్స్ చెయ్యాలని చూశారు.

" ఇల్లలగ్గానే పండుగ కాదు. మంత్రుల రికమండేషన్ లేకుండా లక్షలు కుమ్మరించకుండా ఇంటర్వ్యూలో సెలక్టు కారు. అయిన భాగోతం చాలు గాని ఇంకా ఊసెత్తకు " ఆదేశిస్తున్నట్టుగా అన్నారు మావగారు.

అవమానకరంగా అన్పించాయా మాటలు. పిపీలికంలా జమకట్టినట్టు బాధేసింది. పెదవి కొరుక్కున్నాను. పిడికిలి బిగిసింది.

ఇంటర్వ్యూ కెళ్ళడం సెలక్టవడం ఆ మర్నాడే మస్కట్ నుంచి శార్వరి హఠాత్తుగా ఊడిపట్టం చకచకా జరిగిపోయాయి.

" నువ్వు నా యుక్తవంటే నమ్మకం కుదరట్లేదు." ఇంట్లో కొస్తూనే అన్నారు.

" మీలోనూ చాలా మార్పొచ్చింది. బాగా చిక్కేరు. నల్ల బడ్డారు. మునుపటి ఉత్సాహం లేదు..."

" నేనో నాలుగేళ్ళు ఇక్కడ లేనంత మాత్రాన నువ్వింతగా మారిపోవాలా ? ఆడది తిరిగి చెడింది అంటారిందుకే కాబోలు !"

" నేనేం మారలేదండీ. నేనెప్పటికీ మీ యుక్తనే "

" కాదు. ఒకనాటి యుక్తలోని అందం అణకువ అమాయకత్వం ముగ్ధత్వం మచ్చుకి కూడా నీలో లేవిప్పుడు "

" మీకలా అన్పిస్తోందేమోగాని నేనేం మారలేదు. అయినా మార్పు సహజం. మగాళ్ళకైనా సరే "

" మగాడు ఎలాగైనా మారొచ్చు గాని ఆడది మాత్రం మారకూడదు "

" ఏం పాపం ? "

" పాపమా శాపమా అన్నది కాదు ప్రశ్న. లక్ష్మణుడు నాలుగేళ్ళు కాదు పద్నాలుగేళ్ళు అరణ్యవాసానికెళ్తే అతడి భార్య ఊర్మిళ ఏం చేసిందో తెలుసా ? భర్తకు లేని సుఖం సంతోషం రాజభోగం ఏమీ తనకక్కర్లేదని చెప్పి అతడు తిరిగొచ్చేదాకా నిద్రలో మునిగిపోయింది. పతివ్రత అంటే ఆమెనే చెప్పుకోవాలి "

ఆయన మాటలు ఇనుప ముళ్ళై గుండెల్ని గుచ్చాయి. నిగ్రహించుకుంటూ " అక్కడికి మీరేదో విల్లంబులు చేతబట్టి తిరుగుతున్నట్టు మాట్లాడతారేమిటీ !" నవ్వుతూనే అన్నాను.

ఒక వారం రోజుల పాటు మునుపెన్నడూ లేనంత సరదాగా వున్నారు. సినిమాలకీ హొటల్స్‌కీ తిప్పారు. నగలూ చీరలూ కొన్నారు.

" ఇంకో ఎనిమిది నెలల్లో నా కాంట్రాక్టు పూర్తవుతుంది. ఆ తర్వాత ఇంకెప్పటికీ మనం కలిసే ఉండొచ్చు..." తిరిగెళ్ళడానికి సూట్‌కేసులు సర్దుకుంటూ అన్నారు.

" అధికారం. డబ్బూ వున్న ఆడదాన్ని అదుపు చెయ్యడం బ్రహ్మతరం కాదురా అబ్బాయ్ " హాల్లోంచి అరిచారు మావగారు.

" నువ్వు ఉద్యోగం చేయాల్సినంత ఖర్మేం పట్టలేదు. మనక్కావల్సినంత డబ్బుంది.."

" డబ్బుకోసం కాదు. నా వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలన్న తపన. ఏదో చేయాలన్న ఆరాటం. అంతే. ఏ ఊళ్ళో పోస్టింగు ఇచ్చినా తర్వాతిక్కడికి మార్పించుకుంటాను. కుదరకపోతే మానేస్తాను "

" నేను తిరిగొచ్చేసరికి నువ్వెక్కడో వుంటే నీ కోసం ఎదురుచూస్తూ కూర్చోవడం నా తరం కాదు "

" నేను వెయిట్ చెయ్యలేదూ ? "

" నేను మగాడ్ని "

" కావొచ్చు. భార్యా భర్తలు అజన్మాంత స్నేహితులంటారు ఆ మాత్రం ఎడ్జస్ట్

చేసుకోలేమా ? "

" వాదన అనవసరం. అఫీసర్ హోదా ముఖ్యమో భార్య స్థానం ముఖ్యమో ఏదో ఒకటి తేల్చుకో " తీవ్రస్వరంతో అన్నారు.

" ఆడది అందునా పెళ్ళైన ఆడది ఎదగ కూడదు. ఎగర కూడదు. అసలామెకి రెక్కలుండకూడదు. ఒకవేళ రెక్కలు మొలిస్తే వాటిని కత్తిరించుకుని మొగుడికీ ఇంటికీ అంకితమై పోవాలి. అంతే తప్ప ఆమెకో బ్రతుకు, ఇంకో లోకం వుండనే కూడదు. అంతేనా ?"

" అవునంతే. ఏమంటావ్ ? "

" మీరంటే అసహ్యంగా ఉంది "

* * *

నాకిప్పుడు ' ఊర్మిళ నిద్ర ' పాటంటే పరమ రోత !

**(నవ్య వారపత్రిక 11.1.2012)**

(తమిళ, కన్నడ భాషల్లోకి

అనువదింపబడింది)